ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 10.08.2024 మధ్యాహ్నం 1-10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది.
2. తెలంగాణలో వర్గీకరణను వెంటనే అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు.
3. త్వరలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటించి , 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు శాసనసభకు తెలియచేశారు.
4. శాసనసభలో మహిళా సభ్యులపట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో BRS సభ్యులు సభా కార్యకలాపాలను అడ్డుకునేందుకు యత్నించారు.

**SUPREME VERDICT:**

విద్యా సంస్థల్లో ప్రవేశాలు , ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ , ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లను ఉపవర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం ఈరోజు తీర్పునిచింది. ఈ మేరకు 2004లో ఐదుగురు సభ్యులు ఇచ్చిన తీర్పును తాజాగా విస్తృత ధర్మాసనం తోసిపుచ్చి ంది. 6:1 మెజారిటీతో భారత ప్రధానన్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. తాజా తీర్పును అనుసరించి ప్రభుత్వాలు దీనిపై తదుపరి మార్గదర్శకాలు రూపొందించుకోవాలని సూచించింది. వ్యవస్థాగతంగా ఎదుర్కొంటున్న వివక్ష కారణంగా ఎస్సీ ,

ఎస్టీ వర్గాల వారు పైకి రాలేకపోతున్నందున ఒక కులంలో ఉపవర్గాలు చేసేందుకు రాజ్యాంగంలోని 14వ అధికరణ అనుమతి కల్పిస్తుందని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ధర్మాసనంలో ఆరుగురు న్యాయమూర్తులు దీనికి మద్దతు తెలుపగా.. జస్టిస్ బేలా త్రివేది మాత్రం ఉపవర్గీకరణ సాధ్యం కాదంటూ వ్యతిరేకించారు.

NSD

**CM**

తెలంగాణలో వర్గీకరణను వెంటనే అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ ఉప వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును ఆయన స్వాగతించారు. ఇలాంటి సంచల తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టుకు కృతజ్ఞతలు తెలియచేశారు. అవసరమైతే ఇప్పటికే ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లలో వర్గీకరణను అమలు చేసేలా ఆర్డినెన్స్ తెచ్చి, మాదిగ ఉప కులాలకు న్యాయం చేస్తామని అసెంబ్లీలో వెల్లడించారు.

(MSL)

**KTR**

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బీఆర్ఎస్ స్వాగతిస్తోందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు చేసిన పోరాట విజయమిదన్నారు. తెలంగాణ రాష్ట్ర డిమాండ్ ఎంత న్యాయమైనదో...ఎస్సీ వర్గీకరణ కూడా అంతే న్యాయమైన డిమాండ్ అని ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రావు భావించారని ఆయన గుర్తు చేసారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రశేఖరావు ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఎస్సీ వర్గీకరణ చేయాలంటూ లేఖ ఇచ్చారని ఆయన ఈ సందర్భాం గుర్తు చేశారు.

PN

**MANDA KRISHNA**

సుప్రీంకోర్టు తీర్పుతో విజయం చవిచూశామని ఎంఆర్ పిఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎస్ సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం 30 సంవత్సరాలుగా ఎన్నో పోరాటాలు

చేశామన్నారు. మాదిగలకు జరుగుతున్న అన్యాయాలపై ప్రజల్లో అవగాహన కల్పించామని , మొక్కవోని దీక్షతో ఒంటరిగా పోరాడామన్నారు.

(Desk)

**ASSEMBLY - SRIDHAR BABU**

త్వరలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటించి , 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. శాసనసభలో 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' బిల్లును మంత్రి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పరంగా అందరికీ ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కాదన్నారు. నైపుణ్యాలు, ఉపాధి అంతరాల పరిష్కారం కోసం ప్రత్యేక సంస్థ ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నామని చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుందని వివరించారు. స్కిల్ యూనివర్సిటీ రాష్ట్రంలో మరిన్ని పరిశ్రమల స్థాపనకు ఊతమిస్తుందని, 2024-25 సంవత్సరంలో 2వేల మంది విద్యార్థులకు, వచ్చే ఏడాది 10వేల మందికి శిక్షణ ఇస్తామని అన్నారు. ముచ్చర్లలో స్కిల్ వర్సిటీ కోసం శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి తెలిపారు.

(MSL)

**INTERMEDIATE**

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కళాశాలల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ లో చేరేందుకు గడువు పొడిగించారు. ఈనెల 20 వరకు ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి శ్రుతి ఓజా ఒక ప్రకటనలో తెలిపారు.

(PN)

**ASSEMBLY -BRS:**

శాసన సభలో మహిళా సభ్యులపట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో BRS సభ్యులు ఆందోళన చేస్తూ సభా కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఉదయం సభ సమావేశం అవుతూనే స్పీకరు ప్రసాద కుమార్ స్కిల్స్ యూనివర్సిటీ బిల్లును చర్చకు చేపట్టారు. అయితే BRS మహిళా సభ్యుల పై వ్యాఖ్యల విషయమై వారికి మాట్లాడే అవకాశం

ఇవ్వాలని BRS సభ్యులు K తారక రామారావు , హరీష్ రావు ఇతర సభ్యులు కోరారు. బిల్లు పై చర్చ అనంతరం అవకాశం ఇస్తానని స్పీకరు చెప్పినప్పటికీ సంతృప్తి చెందని BRS సభ్యులు వెల్ లోకి పదే పదే దూసుకువెళ్ళారు. నైపుణ్యాల విశ్వవిద్యాలయం బిల్లుపై చర్చ కొనసాగటంతో బీఆర్ఎస్ సభ్యులు వెల్ లో బైటాయించి ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గందర గోళ పరిస్థితుల మధ్యే సభా కార్యకలాపాలు కొనసాగాయి.

(MSL)

KTR

కాగా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఛాంబర్ ఎదుట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బైఠాయించారు. మహిళా సభ్యులకు క్షమాపణ చెప్పేంత వరకు అక్కడే నిరసన తెలుపుతామని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. దీంతో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ బయటకు పంపారు. ఈ సందర్బంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామారావు మాట్లాడారు. ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి , సునీతా లక్ష్మారెడ్డికి ముఖ్యమంత్రి , డిప్యూటీ సీఎంలు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

(Desk)

**NAGARJUNA SAGAR (NLG)**

నల్గొండ జిల్లాలోని నాగార్జున సాగర్ జలాశయానికి ఎగువ నుంచి భారీ వరద ప్రవాహం కొనసాగుతున్నది. ప్రస్తుతం జలాశయానికి 2.82లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అవుట్ ఫ్లో 7,012 క్యూసెక్కులుగా ఉన్నది. జలాశయం పూర్తి నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 532.5 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 172 టీఎంసీలుగా ఉన్నది. ప్రస్తుతం కృష్ణా బేసిన్‌లోని శ్రీశైలం , జూరాల, ఆలమట్టి డ్యామ్‌కు వరద ప్రవాహం కొనసాగుతున్నది. ఈ క్రమంలో ప్రాజెక్టుకు వచ్చిన వరదను దిగువకు వదులుతున్నారు.

(PTC)

**UTHAM KUMAR**

కాగా, ఈరోజు సాయంత్రం 4 గంటలకు నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొంటారని పేర్కొన్నారు.

(డెస్క్)

**RAINS**

తెలంగాణ వ్యాప్తంగా ఈరోజు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, ములుగు, భద్రాద్రి, ఖమ్మం, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలియచేసింది. మిగిలిన జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు పలు జిల్లాలకు హెచ్చరికలు జారీ చేసింది.

(PN)

**SIRCILLA**

దివ్యాంగులకు పలు రకాల పరికరాలను ఉచితంగా అందచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా సంక్షేమాధికారి పి.లక్ష్మీరాజం తెలిపారు. బ్యాటరీతో నడిచే మూడు చక్రాల సైకిల్ , చేతికర్రలు, చంక కర్రలు , వీల్ చేయిర్లు , వినికిడి యంత్రాలు , అంధుల చేతికర్ర , ఎల్ బో క్రచెస్ , కృత్రిమ అవయవాలు , అంధ విద్యార్థులకు స్మార్ట్ ఫోన్లు వంటివి అందజేయనున్నట్లు వివరించారు. ఈనెల 5న బోయినపల్లి, 6న ఇల్లంతకుంట, 7న వేము లవాడ , 8న చందుర్తి, 9న ఎల్లారెడ్డిపేట, 10న సిరిసిల్లలో దివ్యాంగుల గుర్తింపు కోసం శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 40 శాతానికి తగ్గకుండా వైకల్య ధ్రువీక రణ పత్రం , రేషన్ కార్డు , ఆదాయ ధృవీకరణ , ఆధార్, ఓటర్ గుర్తింపు కార్డు , రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని అర్హులైన దివ్యాంగులకు సూచించారు.

(PTC)

**NIRMAL**

నిర్మల్ జిల్లాలో ఈరోజు నుండి 7వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలు నిర్వహిస్తున్నామని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్  తెలిపారు. ప్రతీ శిశువుకు తప్పకుండా తల్లిపాలు అందించాలని సూచించారు. శిశువుల శారీరక , మానసిక  ఎదుగుదలకు తల్లిపాలు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. తల్లిపాల ఉపయోగాల పట్ల ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

(PTC)